క్లుప్తంగా

ఏమాయికుంటలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకృష్ణ ఆస్పత్రి వైద్యులు క్రాంతి, దుర్వ గణేష్, కావ్య, రాహుల్ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎస్సీవర్గీకరణతో మాదిగ ఉప కులాలకు న్యాయం'



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని బుడగ జంగం మండల అధ్యక్షుడు పెంటన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల తర్వాత సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకులంగా తీర్పు వెలువరించడం మాదిగల విజయమన్నారు. కార్యక్రమంలో బుడగ జంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల గంగయ్య, మండల ఉపాధ్యక్షుడు గడ్డం రవి, సిరిగిరి రాములు, హనుమంతు, భీమన్న, టేకుల గంగారం, విలాస్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన 2001–2002 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి ధరంసింగ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పూర్వ విద్యార్థులు ఆదివారం ఏమాయికుంట గ్రామానికి సందర్శించి ఆర్థిక సాయం అందించారు. నిత్యావసర సరుకులతో పాటు రూ. 40వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, గుట్టే జనార్దన్, కేంద్రే న్యాను, రామారావ్, నాగోరావ్, దేవిదాస్, ప్రేమ్‌సింగ్, మీర్జా జీలానిబేగ్, గౌస్‌బేగ్, ఫడ్ కృష్ణ, సాయినాథ్ పాల్గొన్నారు.

యామిని కృష్ణమూర్తికి నివాళి



నివాళులర్పిస్తున్న చిన్నారులు

ఆదిలాబాద్: ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నృత్యకారిణి యామిని కృష్ణమూర్తికి బాల కేంద్రం చిన్నారులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి మాట్లాడుతూ కళా రంగానికి యామిని కృష్ణమూర్తి చేసిన సేవలు ఏనలేనివని కొనియాడారు. నేటి నృత్యకారులు ఆమెను ఆదర్శంగా తీసుకొని గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి బీజేపీ నేత రిజిస్ట్రేషన్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు లోలపు శివకుమార్ అవయవదానం చేయడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తన మరణానంతరం అవయవ దానం చేసేలా ఆగస్టు 2న రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు శివకుమార్ తెలిపారు. మనిషి శరీరంలోని అవయవాలు మరణించిన అనంతరం అత్యవసరమైన వారికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

తాంసి: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై శివరాం హెచ్చరించారు. ఆదివారం మండలంలోని జామిడి గ్రామం వద్ద సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేయడంతో పాటు వాహనపత్రాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనదారులకు జరిమానా విధించారు. సిబ్బంది సంతోష్, రఫూఫ్, రాము ఉన్నారు.

కూరగాయల సాగులో ఆదర్శం



అడేగామ(బి)లో సాగు చేస్తున్న బీర

- అడేగామ(బి)లో పత్తి, సోయాకు ప్రత్యామ్నాయం
- బావుల నీటితో సాగు

ఇచ్చోడ: కూగాయలు సాగులో అడేగామ(బి) రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పత్తి, సోయాకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనవృష్టి కారణంగా పత్తి, సోయా పంటలతో నష్టపోయిన రైతులు కూరగాయలు పండించి ఆ నష్టాన్ని పూడ్చుకుంటున్నారు. కూరగాయల సాగుకు ఇక్కడి నేలలు అనుకులమైనప్పటికీ చుక్క నీరు లేక, చెరువులు, బోర్ల ద్వారా సాగు నీరు అందే పరిస్థితి లేదు. కానీ భగీరథ ప్రయత్నంతో లక్షల రూపాయలు వెచ్చించి వందల ఫీట్ల లోతు బావులు తవ్వుకొని వాటి ద్వారా కూరగాయలు సాగు చేస్తూ.. నష్టాలను ఆగమించి ఆర్థికంగా ఎదుగుతున్నారు.

50 మంది రైతులు సాగు..

అడేగామ (బి)లో అత్యధికంగా 50 మంది రైతులు దాదాపుగా 2 వందల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే టమాట, వంకాయ, బెండకాయ, బీరకాయ, మిర్చి, చిక్కుడు కాయ, పువ్వుగోబి, మెంతి, పాలకూర, చుక్కకూర సాగు చేస్తూ.. లాభాలు గడిస్తున్నారు. కూరగాయలు సాగు చేసే రైతులంతా సొంతగా వ్యవసాయం చేసే వారు కావడం కూడా గమనార్హం. గత కొంత కాలంగా కూరగాయల సాగు చేయడంతో ఎప్పుడు ధరలు పలుకుతాయే.. వాటిని ఎప్పుడు సాగు చేయాలో మేలుకువలు పాటిస్తూ.. కూరగాయలు సాగు చేస్తున్నారు.

అడేగామలో 60 బావులు..

అడేగామ(బి)లో దాదాపుగా 60 వరకు వ్యవసాయ బావులు ఉన్నాయి. ఒక్కొక్క బావి కనీసం 50 ఫీట్ల వెడల్పుతో కనీసం 150 ఫీట్ల కన్న ఎక్కువ లోతు తవ్వుకున్నారు. ఒక్కక్క బావి తవ్వడానికి కనీసం రూ. 5 నుంచి రూ. 10 లక్షల వరకు వెచ్చించారు. గ్రామ పరిధిలో బోరు బావుల వేసిన నీళ్లు పడకపోవడంతో భగీరథ ప్రయత్నంతో మొదట ఒక్క రైతు పొలంలో బావిని తవ్వించాడు. దీంతో ఒక్కక్కరు బావులు తవ్వడం ప్రారంభించారు. అక్కడి రైతులు చేసిన భగీరథ ప్రయత్నం ఫలించడం ప్రతీ రైతు పొలంలో బావి ఉంది. బావుల అడేగామగా ఈ గ్రామానికి ప్రత్యేకత ఉంది.

ఏడేళ్లుగా కూరగాయల సాగు



గత ఏడేళ్లగా కూరగాయలు సాగు చేస్తున్న. ఈ ఏడాది రెండు ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. ప్రతీ ఏటా రూ. 4 లక్షల వరకు అదనంగా ఆదాయం వస్తుంది. మేలుకువలతో సాగు చేయడం ద్వారా సాగులో లాభాలు వస్తున్నాయి.

– తడికెల సంతోష్, రైతు

ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా



పత్తి, సోయా పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు సాగు చేయడం ద్వారా ఇతర పంటల పెట్టుబడులకు కొంత చేదోడుగా ఉంటుంది. కూరగాయలు అమ్మడం ద్వారా రోజు డబ్బులు రావడంతో కూలీల ఖర్చుకు వినియోగిస్తున్నాం.

– అశోక్, రైతు

రైతులను ప్రోత్సహించాలి



కూరగాయలు సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. సబ్సిడీపై కూరగాయల విత్తనాలు అందచేయాలి. సాగుకు ఉపయోగపడే ఇతర పనిముట్లను సబ్సిడీపై అందచేసి కూరగాయలు సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించాలి.

– సిందేమాధవ్, రైతు

బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేశామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో దళితబస్తీ లబ్ధిదారులకు పెట్టుబడి సాయం చెక్కుల పంపిణీకి హాజరయ్యారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి 54 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ దళితుల అభివృద్ధికి దళితబస్తీ ప్రవేశపెట్టారని, వీటితో పాటు దళిత బంధు సైతం ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పథకం నిలిచిపోయిందన్నారు. మండల ప్రధాన సమస్యగా ఉన్న అంతరాష్ట్ర రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వమే రూ.18 కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీటీ హరిదాస్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, నాగ య్య, అనిల్, లస్మన్న, అభిరాం రెడ్డి, వంశీ, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంతలో తిరిగి.. బజ్జీలు తిన్న ఎమ్మెల్యే

తాంసి: రోజువారీ అధికారిక కార్యక్రమాల్లో ఆయా ఎమ్మెల్యేలు బిజీ బిజీగా ఉంటారు. కానీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాత్రం ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో ప్రతివారం నిర్వహించే వారసంతలో కలియ తిరిగారు. ఒక హోటల్‌లోకి వెళ్లి బజ్జీలు కొనుగోలు చేసి అక్కడే నాయకులతో కలిసి తిన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పనులు ప్రారంభిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని పట్‌పట్‌తండా, మాట్‌లొద్ది గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, బ్లాక్ అధ్యక్షుడు ప్రవల్‌చందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖరెడ్డి, బద్దం పోతారెడ్డి, జాదవ్ కపిల్, రమేశ్, మహేశ్, సంపత్, రాథోడ్ పరశురాం పాల్గొన్నారు.

7న పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు

బేల: మండల కేంద్రంలోని శ్రీరామమందిరం కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 7న ఉదయం 11గంటలకు పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సాంగిడి పోస్టాఫీసు పోస్ట్‌మాస్టర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో మధ్య తరగతి బడుగు బలహీన ప్రజలకు ఉపయోగపడే పోస్టల్ పథకాలు, పోస్టల్ ప్రమాద భీమా, గ్రామీణ పోస్టల్ సేవల సౌలభ్యం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు, అభిమానులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారితో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేకు బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రికార్డ్ స్థాయిలో రక్తదానం..

ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. 1035 మంది రికార్డు స్థాయిలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో లాలామున్న, దినేష్ మటోలియ, ఆకుల ప్రవీణ్, ఆర్యన్ రాజేశ్, మహేందర్, ధోని జ్యోతి, సునంద రెడ్డి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అభిమాని



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రోడ్లపైనే మూగజీవాలు

- వినుగెత్తిపోతున్న వాహనదారులు
- సంతలోనూ అదే తీరు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలోని రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్, ఐబీ చౌరస్తా, పాత ఉట్నూర్, పాత బస్టాండ్, అంగడీబజార్‌తో పాటు శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో రోడ్లపైనే మూగ జీవాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో సైతం ఇదే తీరు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంతజరుగుతున్నా.. పశువుల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటు సంతలోనే ఇదే పరిస్థితి నెలకొంది. సమస్య ఉన్నప్పటికీ పట్టించుకునే నాథులు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఇరుకు వంతెనలు, వంతెనలు పగిలిపోయి, స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇది కాకుండా గుంపులు గుంపులుగా రోడ్లపై పశువులు తిరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పశువులను రోడ్లపైకి వదలకుండా యజమానులను కట్టడి చేయాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విని పిస్తున్నాయి.

నిరుపయోగంగా బంజరు దొడ్లు..

రోడ్లపై వదిలేసిన పశువులను బంజరు దొడ్లలో వేసి వారికి తగిన రుసుము విధించి వారికి అప్పచెప్పడం జరుగుతుంది. కానీ ఉన్న బంజరు దొడ్లు నిరుపయోగంగా మారాయి. గతంలో రోడ్డుపై ఉన్న పశువులను బంజరు దొడ్లలో వేసి జరిమానా విధించేవారు. ప్రస్తుతం అవేవి పట్టించుకోకపోవడంతో పశువులను రోడ్డుపై వదిలేస్తున్నారు. వారసంతల్లో కిక్కిరిసిన జనాల మధ్య పశువులు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పశువుల కుమ్ములాటలో జనాలు గాయాల పాలవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరిగినా.. పంచాయతీ అధికారులు వారసంతలో ట్యాక్స్‌లు తీసుకుంటున్నారు తప్పా.. ప్రజలకు రక్షణ కల్పించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పశువులు తిరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రోడ్లపై పశువులు సంచరించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పశుయజమానులకు జరిమానా విధించాలి. స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు చర్యలు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– తన్వీర్ పఠాన్, డ్రైవర్

రాత్రి పగలు రోడ్లపైనే..



రాత్రి పగులు అనే తేడా లేకుండా పశువులు రోడ్లపై తిరగుతున్నాయి. అయినా.. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. పశువుల వలన వాహనదారులు విసుగెత్తిపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యతు ఎవరిదని ప్రశ్నిస్తున్నారు.

– కాటం రవీందర్, శ్యాంపూర్

నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

ఆదిలాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తుందని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు కపీల్ అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించడంపై ఆదివారం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రెరీలో నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. నిరుద్యోగులు ఎంతో ఆశగా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం హర్షనీయమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకత్వం నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఆ మాటను నిలబెట్టుకుంటూ ఉద్యోగ నోటిఫికేషన్ల ప్రక్రియను వేగవంతం చేసే దిశగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందించేందుకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం



స్వామిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామి ఇటీవల బదిలీ కావడంతో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆదివారం ఘనంగా సత్కరించారు. 10 సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ బజార్‌హత్నూర్ మండల అధ్యక్షుడు కటకం చంద్రకాంత్ బాబు, ఉపాధ్యాయులు రామగిరి దామోదర్, గౌరు శ్రీధర్, నాగభూషణ్, కొండ రమేశ్, రామగిరి శ్రీనివాస్, పెరక మహేందర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాము

బోథ్: యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోథ్ ఎస్సై రాము అన్నారు. ఆదివారం మండలంలోని గుట్టపక్కతండా గ్రామంలో యువకులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఇటీవల సొనాల పరిసర ప్రాంతాల్లో గంజాయి దొరకడంతో పలు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. యువకులు గంజాయికి బానిస కావద్దన్నారు. కొన్నిగంటల మత్తు కోసం జీవతం కోల్పోవల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, రామ్మూర్తి, నరేశ్, నాయకులు బల్వీర్, యువకులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

తాంసి: ఈనెల 9న జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో గార్డెన్‌లో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భీంపూర్ మండల తుడుందెబ్బ అధ్యక్షుడు నాగోరావు కోరారు. భీంపూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీ నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు నాగోరావు మాట్లాడుతూ.. 9న నిర్వహించే సభకు మండలంలో నుంచి అధికంగా గిరిజనులు హాజరు కావాలని కోరారు. ఆదివాసీల ఐక్యతను తెలియజేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు సిడాం ప్రభు, కుడ్మేత సోనేరావు, మనోహర్, వెడ్మ మారుతి, పాండ్‌రంగ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: ఈనెల 9న హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ సమక్షంలో తుడుందెబ్బ, రాయిసెంటర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఆదివారం నాయకులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాల్లో ఆదివాసీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బోథ్ మండలంలో భగత్ సింగ్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. పెసా చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్, ఆడెం భీంరావ్, మడావి గంగారాం, రామెల్లి భోజన్న, కనక అమృత్, జుగ్నక్ మారుతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అందించిన సత్ఫలితాలే ప్రస్తుతం అందుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన గౌస్కుల విజయ ఏఈ ఫలితాల్లో మిషన్ భగీరథ శాఖలో ఏఈగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఆదివారం పట్టణంలోని తిలక్‌నగర్‌లో గల ఆమె నివాసానికి వెళ్లి అభినందించారు. తల్లిదండ్రులు రవీందర్– గీతలను శాలువాతో సత్కరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు కొండ గణేష్, మహేందర్, సంజయ్, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఐటీఐ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఐటీఐ కళాశాల విద్యార్థులకు అత్యాధునిక యంత్రాలు, పరికరాలలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌ల గల ఐటీఐ కళాశాల సమీపంలో రూ. 4 కోట్ల 76 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ, లంబాడాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే గళమెత్తడంతో ఇందుకు హర్షిస్తూ ఎమ్మెల్యేను సర్‌మెడీలు ఘనంగా సన్మానించారు.